## వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేలిన యూపీఎస్

- భయాందోళనకు గురైన ఉద్యోగులు
- తాత్కాలికంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అకస్మాత్తుగా కంప్యూటర్ సిస్టమ్‌కు సంబంధించిన యూపీఎస్ పేలిపోవడంతో కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కార్యాలయంలో ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో అప్రమత్తమైన ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అయితే ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. యూపీఎస్ పేలిన కారణంగా కార్యాలయంలో విద్యుత్ సరఫరా, కంప్యూటర్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడటంతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్ వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ విజయ భాస్కర్‌ను వివరణ కోరగా, యూపీఎస్ బ్లాస్ట్ అయిన విషయం నిజమేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకునే ప్రజలు సాంకేతిక నిపుణులు వచ్చి యూపీఎస్ మరమ్మత్తు పనులు పూర్తి చేసిన అనంతరం మాత్రమే స్లాట్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. మరమ్మత్తులు పూర్తైన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ తిరిగి ప్రారంభమవుతుందని తెలిపారు. అప్పటివరకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి భూమి ఆక్రమణ యత్నం..

## న్యాయం చేయాలంటూ జిల్లా పోలీస్ అధికారిని ఆశ్రయించిన బాధితుడు

- భూమి వివాదం ఉద్రిక్తం.. "మాట్లాడితే హత్య చేస్తాం" అంటూ బెదిరింపులు ఆరోపణ






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 14**
జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ తన సొంత స్థలాన్ని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన గిరవెన కొరక్క భర్త సారయ్య జిల్లా పోలీస్ అధికారిని ఆశ్రయించారు. తన కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.
ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఇంటి నెంబర్ 4-7/4కు సంబంధించిన స్థలం తన సొంతమని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్ 3972/2025 ఆధారంగా చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమి అని సారయ్య తెలిపారు. అయితే ఆత్మకూరు రాజయ్య తండి కనకయ్యతో పాటు అతని కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, విజయ్, రంజిత్, సందీప్ కలిసి తమ స్థలంలో అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కూడా వారికి సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఇప్పటికే ఈ భూమి వివాదంపై ప్రతివాది రాజయ్య జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని, అనంతరం తాను భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి పన్ను రసీదులు, స్టాంప్ దస్తావేజులు తదితర ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు నెంబర్ 765/2026లో తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ జారీ అయినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ప్రతివాదులు గోడ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
అంతేకాకుండా "స్థలం విషయమై ఎవరితో మాట్లాడినా హత్య చేస్తాం" అంటూ తనను, కుటుంబ సభ్యులను ప్రాణహానితో బెదిరిస్తున్నారని సారయ్య ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల ప్రతులను స్థానిక పోలీసులకు అందజేసినా తగిన రక్షణ కల్పించకుండా ప్రతివాదులకు సహకరిస్తున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.
భూమికి సంబంధించిన పూర్తి ఆధారాలు, జిరాక్స్ పత్రాలు జిల్లా పోలీస్ అధికారికి సమర్పిస్తున్నానని, అవసరమైతే భూమి విక్రయ సమయంలో ఉన్న సాక్షులను కూడా విచారణకు హాజరుపరుస్తానని సారయ్య తెలిపారు. తన స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను వెంటనే తొలగించి, కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## గోవధ, అక్రమ గో రవాణా అరికట్టాలి

- జిల్లా ఎస్పీకి విశ్వహిందూ పరిషత్ వినతిపత్రం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో గోవధ, అక్రమ గో రవాణాను అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీకి గురువారం వినతిపత్రం సమర్పించారు. ముక్కోటి దేవతల స్వరూపమైన గోమాతను రక్షిస్తూ హిందువుల మనోభావాలను గౌరవించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా గోవులు, కోడెల రవాణాను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. గోవధ నివారణకు కఠిన చర్యలు చేపట్టి శాంతి భద్రతలను పరిరక్షించాలని నాయకులు కోరారు. అలాగే దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో కళ్యాణి బిర్యానీ సెంటర్లు, గోవధ కేంద్రాలను తొలగించి కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు గడప కిషోర్ రావు, నాగుల రాము గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్,మహేష్, కమలాకర్, గోపి హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజకీయ కుట్రలకు బీజేపీ గట్టి హెచ్చరిక

- బండి సంజయ్‌పై తప్పుడు ప్రచార పోస్టర్లు చించేసిన జమ్మికుంట బీజేపీ నాయకులు
- "రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని" మండిపాటు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 14**
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని జమ్మికుంట పట్టణంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై తప్పుడు ప్రచారం చేస్తూ అంటించిన వాల్ పోస్టర్లను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా బండి సంజయ్‌ను ఎదుర్కోలేక కొందరు కావాలనే దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ పోస్టర్లను చించేసి నిరసన తెలిపారు.
ఇటీవల న్యాయస్థానంలో బండి భగీరథ హాజరైనప్పటికీ, అతను కోర్టుకు హాజరుకాలేదని తప్పుడు సమాచారంతో ప్రచారం చేయడమే కాకుండా, దానికి బండి సంజయ్ ఫోటోను జతచేసి వాల్ పోస్టర్లు అంటించడం దురుద్దేశపూరిత చర్య అని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విధమైన అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు.
జమ్మికుంట పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, బండి సంజయ్ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ప్రత్యర్థి పార్టీలు భయపడుతున్నాయని ఆరోపించారు. అందుకే అబద్ధాలు, వక్రీకరణలు, తప్పుడు పోస్టర్లతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. కానీ ప్రజలు నిజానిజాలను గమనిస్తున్నారని, ఇలాంటి చీప్ రాజకీయాలకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు.
బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిత్వ హననానికి దిగడం దారుణమన్నారు. ఒక ప్రజాప్రతినిధిపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేస్తూ పోస్టర్లు అంటించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలను బీజేపీ కార్యకర్తలు సహించబోరని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తప్పుడు ప్రచారాలు కొనసాగితే తీవ్ర స్థాయిలో నిరసనలు చేపడతామని తెలిపారు.
పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, గోడలపై అంటించిన పోస్టర్లను బీజేపీ నాయకులు తొలగిస్తూ "సత్యమే గెలుస్తుంది", "తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరు" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమం సందర్భంగా బీజేపీ కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం కనిపించింది.
ఈ కార్యక్రమంలో ఆకుల రాజేందర్, దొంతర వీణ రమేష్ యాదవ్, సంపెల్లి సంపత్ రావు, కైలాసకోటి గణేష్, ఆవుల తిరుపతి, శ్రీవర్ధి ప్రవీణ్, అడవుల శ్రీధర్, రాయబారం సురేష్, పంజాల అనిల్, ఉడుగుల మహేందర్, సుంకర్ యాదయ్య తదితరులు పాల్గొని పోస్టర్లను చించేసి నిరసన తెలిపారు.

## రుద్రంగి, చందుర్తి సెక్షన్ కార్యాలయాలను పరిశీలించిన ఎస్ఈ వేణు మాధవ్



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా**
వేములవాడ నియోజకవర్గం రుద్రంగి,చందుర్తి సెక్షన్ కార్యాలయాలను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణు మాధవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయ నూతన విద్యుత్ లైన్ పనులను పరిశీలించడంతో పాటు రుద్రంగి సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ సామర్థ్యాన్ని 5.0 ఎంవీఏ నుంచి 8.0 ఎంవీఏకు పెంపుదల చేసే పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అలాగే విద్యుత్ శాఖకు సంబంధించిన పలు పారామీటర్లపై అధికారులతో చర్చించారు. అనంతరం చందుర్తి సెక్షన్ కార్యాలయాన్ని సందర్శించి, పనితీరుపై సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏడీఈ వి. గంగాధర్, రుద్రంగి, చందుర్తి సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ సలీంకు అశ్రునయన నివాళి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పరామర్శ



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 14**
జమ్మికుంట పట్టణ పరిధిలోని ధర్మారం ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ సలీం మృతితో పట్టణంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సామాన్య ప్రజలకు అండగా నిలిచిన ఎండీ సలీం మరణ వార్త తెలుసుకున్న స్థానిక ప్రజలు, అభిమానులు, రాజకీయ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు.
ఎండీ సలీం పార్థివ దేహానికి స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సలీం చేసిన సేవలు, ప్రజలతో ఆయన కలిసిమెలిసి ఉండే స్వభావాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన మరణం పార్టీకి, ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు.
ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఎండీ సలీం ప్రజా సేవకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. సామాన్య ప్రజల సమస్యలను తనవిగా భావించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ముందుండేవారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరితో స్నేహపూర్వకంగా మెలిగే మంచి మనసున్న నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు.
మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ.. ఎండీ సలీం సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని అన్నారు. సమాజంలో బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
అనంతరం ఇటీవల మృతిచెందిన మైస సురేందర్, మారపల్లి దేవేందర్ కుటుంబాలను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పరామర్శించారు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారి ఆవేదనను పంచుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మైస రవి, గాజుల భాస్కర్, చింతల శ్రీనివాస్, పాతకాల రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరై ఎండీ సలీంకు తుది వీడ్కోలు పలికారు.

## భీమన్న 44 రోజుల హుండీ ఆదాయం 2 కోట్లు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు గురువారం భీమేశ్వర సదన్ లోని పార్కింగ్ ప్లేస్ లో జరిగింది. 44 రోజులకు గాను రూ.2,00,17,810 నగదు, బంగారం--175 గ్రాములు, వెండి--12 కిలోల 200 గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

## స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

**విస్తృతస్థాయిలో పార్టీ నేతల సమీక్షలు**
**నేడు సాధక్‌లతో పవన్ కళ్యాణ్ భేటీ**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరగబోయే ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల బలం మరోసారి చాటనుంది. ప్రత్యేకంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రాజకీయ ఆధిపత్యం కోసం ప్రధాన పార్టీలు ఇప్పటికే వ్యూహరచన ప్రారంభించాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ వార్డుల పునర్విభజన, రాజకీయ పరిస్థితులపై విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తోంది. నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాల వారీ నివేదికలు సమర్పించడం, కూటమి వ్యూహాలపై చర్చించడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పనిచేసిన సాధక్‌లతో పవన్ కళ్యాణ్ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ దృష్టి సారించింది. పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వార్డులు, డివిజన్ల పునర్విభజన అంశంపై కీలక సమావేశం నిర్వహించింది. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ భేటీకి పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ పరిస్థితులు, వార్డుల పునర్విభజన, కూటమి వ్యూహాలపై సమగ్ర చర్చ జరిగింది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక కమిటీలను నియమించారు. ఈ కమిటీలు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా ? గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల వారీగా స్థానిక సంస్థల రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేశాయి. కమిటీ సభ్యులు ఆయా జిల్లాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పర్యటించి స్థానిక రాజకీయ పరిస్థితులను పరిశీలించారు. ప్రత్యేకంగా కూటమి బలాబలాలు, వార్డుల పునర్విభజన ప్రభావం, స్థానిక నాయకత్వ పరిస్థితులు, ఓటర్ల ధోరణి, ఎన్నికల వ్యూహాలు వంటి అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేశారు. ఈ నివేదికలను నాదెండ్ల మనోహర్‌కు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సమావేశంలో కూటమి స్ఫూర్తిని కొనసాగిస్తూ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగింది. తెలుగుదేశం జనసేన, బీజేపీ కూటమి స్థానిక స్థాయిలో కూడా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించినట్లు సమాచారం.

